

• బూడిద, నల్లి, ఆకు ముడత తెగుళ్లతో...

రైతు కుదేలు..!



ఆకు ముడత సోకి ముడతలు పడిన మిరప పంట

• పూత, పిందె దశలోను ఎండిపోతున్న మిరప పంట

• పురుగుమందులు వాడినా ప్రయోజనం శూన్యం

• పెరిగిన పెట్టుబడితో రైతు విలవిల

మిరప రైతులను తెగుళ్ల కష్టాలు వీడడం లేదు. గతేడాది వర్షాలు, గిట్టుబాటు ధర లేక మిరప రైతులు రూ.లక్షల్లో నష్టపోయి అప్పుల పాలయ్యారు. ఈ ఏడాదైనా మంచి దిగుబడితో లాభాలు వస్తాయని ఆశించిన రైతుకు తెగులు రూపంలో నిరాశ ఎదురవుతోంది.

ప్రజాశక్తి - చిప్పగిరి

ఈఏడాది జూన్, జులై నెలలో సాగు చేసిన మిరప పంట ప్రస్తుతం మంచి పూత, కాయ దశలో ఉంది. వర్షాలు అధికం కావడంతో విపరీతమైన తెగుళ్ల సోకాయి. గతేడాది లాగే ఈసారి కూడా ఎర్ర నల్లి, తెల్ల నల్లి పురుగు ఆశించింది. రెండు రకాల పురుగులు సోకడంతో మిరప కాయలకు మచ్చలు ఏర్పడి ఎర్ర కాయలు కూడా నల్లగా మారి కుళ్లిపోతున్నాయి. ఎర్రనల్లితో కింది భాగంలో ఎర్రగా మారి ఆకులు మొత్తం ఎండిపోతున్నాయి. నల్లనల్లి పురుగుతో పూత మొత్తం రాలిపోతోంది. నల్లి పురుగు ఆకులను గోకడం వల్ల ఎర్రగా మారి ఎండిపోతాయని రైతులు తెలుపుతున్నారు. వాటిని నివారించేందుకు వారానికి రెండుసార్లు పురుగు మందులను పిచికారి చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. ఒక్కసారి పురుగుమందులు పిచికారి చేయాలంటే ఎకరాకు రూ.15 వేలు ఖర్చు అవుతుంది. మిరప పంటకు ఎర్రనల్లి, నల్లనల్లికి తోడు ఆకు ముడత కూడా సోకింది. తెగుళ్లను ఎలా అదుపు చేయాలో తెలియక రైతులు సతమతమవుతున్నారు. కొన్నిచోట్ల మిరప పంటకు ఆకుముడత, విల్ట్ సోకి పూర్తిగా ఎండిపోయాయి. కాపు నిలబడకుండా పోయాయి. మండలంలోని గుమ్మనూరు, కాజీపురం, కొట్టాల, దేగులపాడు, ఏరూరు, బంటనహాల్, చిప్పగిరి అక్కడక్కడ బోరుబావుల కింద దాదాపు 5 వేల ఎకరాల్లో మిరప పంటను సాగు చేశారు. గతేడాది ఎక్కువ సాగు అయినప్పటికీ గిట్టుబాటు ధరలు లేక ఈ ఏడాది సాగు విస్తీర్ణం తగ్గిందని రైతులు తెలుపుతున్నారు.

• కాపు దశలో పంటలు దెబ్బతింటున్నాయి

- రైతు రమేష్



కౌలుకు తీసుకొని 8 ఎకరాల్లో మిరప పంటను సాగు చేశాం. పురుగుల నివారణకు రకరకాల మందులు వాడినా ఫలితం లేకుండా పోతోంది. వారానికి రెండుసార్లు మందులు వాడాల్సి వస్తోంది. ప్రస్తుతం మిరపను ఎర్రనల్లి, నల్లనల్లి ఆశించడంతో ఎదుగుదల లేకుండా పోయింది. కాయలు ఎర్రబాడుతున్న సమయంలో నల్లిదెబ్బకు మచ్చలు ఏర్పడి పండు ఎదుగుదల లేకుండా పోయింది. పంట ఎదుగుదలకు ఎరువులతో పాటు నీళ్ల మందు వాడుతున్నా. పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదు.

• పంట మొత్తం దెబ్బతింటుంది

- నాగరాజు, కౌలు రైతు



నేను పది ఎకరాలు కౌలుకు తీసుకొని మిరప పంట సాగు చేశా. ఆకు ముడత తెగులు, ఎర్రనల్లి తెగులు సోకి పచ్చని పంట పొలం మొత్తం దెబ్బతిని పోయే పరిస్థితికి వచ్చింది. ఇప్పటికే ఎకరాకు రూ.80 వేలకు పైగా పెట్టుబడి పెట్టాను. ఎకరాకు మూడు క్వింటాళ్లు లేదా నాలుగు క్వింటాళ్లు దిగుబడి రావడం కూడా కష్టంగా ఉంది. పెట్టుబడులకు ఇప్పటికే రూ.8 లక్షలు అయ్యింది. కనీసం పెట్టుబడులు గట్టెక్కిస్తుందో లేదో.

• జాగ్రత్తలు పాటిస్తేనే

- అగ్రికల్చర్ అసిస్టెంట్ రంగస్వామి



పంట సాగు చేసినప్పటి నుంచి తగిన జాగ్రత్తలు పాటించాలి. ఎర్ర నల్లి, నల్లనల్లి నివారణకు నీమ్ ఆయిల్ 3 మిల్లీలీటర్ల అసిపేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి మిరప మొక్కలపై పిచికారి చేయాలి. గుడ్డును నివారించగలిగితే పురుగును నివారించినట్లే. ప్రాపర్ గెట్ 2 మిల్లీలీటర్లు లేదా ఒబెరాన్ 1మిల్లీలీటరు.. లీటరు నీటిలో కలిపి మొక్కలపై పిచికారి చేయాలి. తెల్ల దోమ నివారణకు ప్రతి పొలంలోనూ పసుపు రంగు అట్టలను ఎకరాకు 40 నుంచి 50 వరకు ఏర్పాటు చేయాలి. విల్టే నివారణకు పంట మార్పిడి తప్పనిసరి. మిరప సాళ్లలో నీరు నిల్వ లేకుండా బయటకు పంపాలి. మిరపను సాగు చేసే సమయంలో పంట ఎండబెట్టకు గురికాకుండా చూడాలి. మిరప పంట చుట్టూ జొన్న, మొక్కజొన్న, సజ్జ వంటి పంటను చివరి మేర సాళ్లలో సాగు చేయాలి. వీటి ద్వారా పురుగు ఉధృతిని అరికట్టవచ్చు.

ఇక్కడే లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్

- రాష్ట్ర మంత్రి టిజి భరత్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



మంత్రి భరత్

ఎపి లోకాయుక్త సంస్థ, ఎపి మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్సి) కర్నూలులోనే ఉంటాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్ చెప్పారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో మంత్రి టిజి భరత్ మాట్లాడారు. కర్నూలులో ఇప్పటికే నెలకొల్పిన సంస్థలు ఏవీ కర్నూలు నుండి తరలించబోమని తెలిపారు. ఈ విషయంలో మంత్రి నారా లోకేష్‌తో చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ సంస్థలన్నీ కర్నూల్లోనే ఉంటాయని ప్రజలకు హామీ ఇస్తున్నానన్నారు. ప్రజలెవ్వరూ ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా హైకోర్టు బెంచ్ కర్నూలులో ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కర్నూలు అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు నాయుడు కట్టుబడి ఉన్నారన్నారు. ఆయన నాయకత్వంలో పనిచేస్తూ రాష్ట్ర అభివృద్ధితో పాటు కర్నూలును అన్ని రంగాల్లో ముందుంచేందుకు తాను ఎంతో కృషి చేస్తున్నానని మంత్రిటిజి.భరత్ చెప్పారు.

అడిషనల్ ఎస్‌పిగా హుస్సేన్‌పీరా బాధ్యతల స్వీకరణ

- ఎస్‌పిని మర్యాదపూర్వకంగా కలిసిన అడిషనల్ ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నూతన అడిషనల్ ఎస్‌పి అడ్మిన్‌గా జి.హుస్సేన్‌పీరా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌పి జి.బిందు మాధవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇది వరకు అడిషనల్ ఎస్‌పి స్థానంలో ఉన్న జి.నాగరాజు ఉద్యోగ విరమణ పొందారు. అడిషనల్ ఎస్‌పి గురించి: స్వస్థలం అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం జెంతలూరు గ్రామం. 1991లో పోలీసుశాఖలో చేరారు. ఆలూరు, నందవరం, నంద్యాల తాలుకా , కోడుమూరులలో ఎస్ఐగా పని చేశారు. 2007లో సిఐగా పదోన్నతి పొందారు. రైల్వే శాఖలో , నంద్యాల టు టౌన్, నంద్యాల తాలుకా, రైల్వే కోడూరు కడప జిల్లాలలో పని చేశారు. 2014లో డిఎస్‌పిగా పదోన్నతి పొందారు. కర్నూలు సిసిఎస్, పిటిసి అనంతపురం, విజిలెన్స్, పెనుగొండ ,జమ్ములమడుగులలో డిఎస్‌పిగా పని చేశారు. జమ్ములమడుగు డిఎస్‌పి గా పనిచేస్తూ అడిషనల్ ఎస్‌పిగా పదోన్నతి పొంది ఇటీవల జరిగిన సాధారణ బదీలలో భాగంగా కర్నూలు జిల్లాకు అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ విధుల్లో లో చేరారు.



ఎస్‌పిని కలిసిన హుస్సేన్‌పీరా

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తకాల, పురాతన నాణేల ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జిల్లా గ్రందాలయసంస్థ కర్నూలు జిల్లాకేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం 75వ జాతీయ గ్రంథాలయ వారోత్సవంలలో భాగంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన, పురాతన నాణెముల ప్రదర్శనను ముఖ్య అతిథి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనరు ఎస్.రవీంద్రబాబు రిబ్బన్ కత్తిరించి ప్రారంబించారు. తదనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులకు ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీల కార్యక్రమాన్ని ఉద్దేసించి మాట్లాడుతూ విద్యార్థులు పుస్థక పఠణాన్ని అలవర్చుకోవాలని, వాటి వలన మన మేదస్సు అభివృద్ధి పరుచుకోవడం వీలవుతుందన్నారు. మంచి తెలివి తేటలు వచ్చేలా,మంచి ఉన్నత దశకు చేరు కోవడానికి ఉపయోగ పడుతుందన్నారు. గ్రంధాలయానికి ప్రతి రోజు కొద్దిగా సమయం కేటాయించుకొని బాగా చదువుకోవాలన్నారు. జిల్లా గ్రంధాలయసంస్థ కార్యదర్శి కె .ప్రకాష్, ఆంధ్రప్రదేష్ గ్రంధాలయ సంస్థ అధ్యక్షులు కూరాడి చంద్రశేఖర కల్యాకర, విశ్రాంత ఇంజనీరు ముచ్చుకోట చంద్రశేఖర్, నిఖిలేష్ యద్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు టి.మద్దులేటి మాట్లాడారు. డిప్యూటీ లైబ్రేరియన్ వి.పెద్దక్క, అసిస్టెంట్ లైబ్రేరియన్ వజ్రాల గోవిందరెడ్డి, లైబ్రేరిన్ ఎస్.బాష, చంద్రమ్మ, నషీమా, రేణుక, ఈశ్వరమ్మ, శ్రీనువాసులు, భాస్కర్, ఉమ, మగ్బుల్ బాష, రాజు, సుదర్శన్, సువర్ణమ్మ తదితర గ్రంధాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పుస్తక ప్రదర్శనను తికలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

ఆ ఇంట్లో ఇద్దరమ్మాయిలూ వైద్యులే...

• కష్టపడి చదువుతూ లక్ష్యం వైపు అడుగులు • కూతుళ్లతో సంతోషాన్ని పంచుకున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు జిల్లా కల్లూరు మండలం నాయికల్లు గ్రామంలో వారిది సామాన్య వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు ఉన్నత చదువులు చదవకపోయినా వారి ఇద్దరి కూతుళ్లను పట్టుదలతో చదివించారు. తల్లిదండ్రుల ఆశయాలను వమ్ము చేయకుండా ఆ ఇద్దరూ కూతుర్లు వైద్యరంగంలో సీట్లు సాధించి శభాష్ అనిపించుకుంటున్నారు. నాయకల్లు గ్రామానికి చెందిన డి.శాలన్న, డి.హాజీరభాను దంపతులకు ఇద్దరు కూతుర్లు. పెద్ద కూతురు ఆఫ్రిన్ ,చిన్న కూతురు అమ్రిన్. ఆ ఇద్దరూ సొంతూరు ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి వరకు చదివారు. ఆరవ తరగతి నుంచి పదవ తరగతివరకు కర్నూలు నగరంలోని రవీంద్రభారతి స్కూల్లో విద్యనభ్యసించారు. అనంతరం ఇంటర్మీడియట్‌కు విజయవాడలోని చైతన్య కాలేజీలో కొనసాగించారు. కడప మెడికల్ కాలేజీలో సీటు సాధించిన ఆఫ్రిన్ ఐదో సంవత్సరం చదువుతూ ఇంటర్న్‌షిప్ చేస్తుంది. అమ్రిన్ కూడా కడప మెడికల్ కాలేజీలో సీటు సాధించి మొదటి సంవత్సరంలో చేరింది. గైనకాలజీ లో ప్రతిభను కనబరిచి పేద మహిళలకు వైద్య సేవలు అందించాలని ఆఫ్రిన్ చెబుతుంది. అమ్రిన్ మాత్రం రేడియాలజీలో ఉత్తమ ప్రతిభ చాటి వైద్యరంగంలో సేవలందించాలని చెబుతుంది. ఇద్దరు కూతుర్లు వైద్య విద్యను అభ్యసిస్తూ ఉండడంతో బంధువులు స్నేహితులు పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు. అందరి దీవెనలతో తమ కూతుర్లిద్దరూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తల్లిదండ్రులు ఆకాంక్షించారు.



తల్లిదండ్రులతో ఉన్న విద్యార్థినులు...

డబ్బు రెట్టింపు పేర టోకరా..!

• ఎఫ్‌సిఐలో ఉద్యోగాలిస్తామని 60 మందికి మోసం

• అపరిచితులు, దళారులను నమ్మి మోసపోవద్దు

• కర్నూలు జిల్లా ఎస్‌పి జి. బిందు మాధవ్

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

అపరిచితులు, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని కర్నూలు జిల్లా ఎస్‌పి ప్రజలకు ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. డబ్బులు రెట్టింపు అవుతాయని, అమేజ్ లైఫ్ పి.ప్యాకెట్ ఆన్ లైన్ సర్వీస్ అనే స్కీమ్ పేరుతో 3వేల మంది బాధితులు మోసపోయారని, ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగాల పేరుతో 60 మంది బాధితులు మోసపోయారన్నారు. ప్రజలు ఇలాంటి మోసాల బారిన పడకూడదని కర్నూలు జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన వివరాల ప్రకారం...ఎమ్మిగనూరు నియోజకవర్గానికి చెందిన కోసిగి, మంత్రాలయం, మాధవరం, పెద్దకడుబూరు లలోని 3 వేల మందికి పైగా ముంబైకి చెందిన అమేజ్ లైఫ్ పిప్యాకెట్ ఆన్ లైన్ సర్వీస్ సంస్థ వారు చెప్పిన మాటలను నమ్మి మోసపోయారన్నారు. ఇటీవల కుర్వ నాగిరెడ్డి (రచ్చుమర్రి గ్రామం, మాధవరం, మంత్రాలయం మండలం) దాదాపు రూ. 13 లక్షలు డిపాజిట్ రూపంలో డబ్బులు పెట్టగా దానికి గాను కేవలం రూ. 3 లక్షలు మాత్రమే వెనక్కు వచ్చాయని మిగతా డబ్బులు రాలేదు. ఆయనతో పాటు చిన్న , పెద్ద మొత్తంలో డిపాజిట్ చేసిన 3 వేల మంది బాధితులు మోసపోయారని ఫిర్యాదు చేశారు. ఈ విషయం పై సమగ్ర దర్యాప్తును వేగవంతం చేసేందుకు ఎమ్మిగనూరు సిఐ శ్రీనివాసులు, మంత్రాలయం సిఐ రామాంజులు, మాధవరం ఎస్ఐ క్రిష్ణమూర్తిలను పోలీసు బృందంగా ఏర్పాటు చేశాం. కేసు పురోగతిని పెంచేందుకు చర్యలు చేపట్టాం. ఊరికే రెట్టింపు డబ్బులు వస్తాయని చెప్పే అపరిచితుల మాటలు నమ్మకూదు. ఇలాంటి మోసాల బారిన పడకూడదు. అప్రమత్తంగా ఉండాలి. ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగాలు ఇప్పిస్తామని కర్నూలు బాలాజీ నగర్ కు చెందిన షేక్ అయేషా భాను , అయేషా భర్త జాకీర్, జహీర్ అను వ్యక్తులు కలిసి మహబూబ్ నగర్ జిల్లా అలంపూర్, కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోనికి చెందిన మొత్తం 60 మంది బాధితులను మోసం చేశారు. ఇది కర్నూలు పోలీసుల దర్యాప్తులో తెలిసింది. ఉద్యోగం పేరుతో ఒక్కోక్కరి నుండి రూ. 2 లక్షల 8 వేలు తీసుకొని మోసం చేశారు. నెలకు జీతం రూ.17,200 వస్తుందని చెప్పి మోసాలు చేశారు. కర్నూలు నగరం బాలాజీ నగర్ కు చెందిన అయేషా భాను , జాకీర్ దంపతులతో పాటు జహీర్ లు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సిఐ) లో ఉద్యోగాన్ని ఇప్పిస్తామని చెప్పడంతో కర్నూలు పట్టణంలోని రామచంద్ర నగర్ కు చెందిన షేక్ అబ్దుల్లా అనే బాధితుడు వారిని కలిసి మోసపోయాడు. మోసగించిన వారిని కర్నూలు పోలీసులు అరెస్టు చేశారు. ఈ తరహాలో 60 మంది దాకా మోసపోయినట్లు పోలీసులు గుర్తించారు. ఉద్యోగాలు ప్రతిభ ఆధారంగానే వస్తాయని, డబ్బులు ఇస్తే ఉద్యోగాలు రావన్నారు. నిరుద్యోగులైన యువత దళారుల మాటలు నమ్మి మోస పోవద్దని ఎస్‌పి ప్రజలకు సూచించారు.



సి బెళగల్ ఎంపిడిఓకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కార్యదర్శులపై కలెక్టర్ అనుచిత వాఖ్యలు తగదు

ప్రజాశక్తి- సి బెళగల్

నంద్యాల జిల్లా కలెక్టరు గురువారం పంచాయతీ కార్యదర్శులపై అనుచిత వాఖ్యలు చేయడం తగదని మండలంలోని కార్యదర్శులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన వాఖ్యలను ఖండిస్తూ సిబెళగల్ ఎంపిడిఓ రాణెమ్మకు వినతిని అందజేశారు. పంచాయతీ కార్యదర్శులుగా ఉంటూ డిడిఒలుగా పనికి రారని అనడం, వేతనాలు వృథా అంటూ నానా బూతు పురాణంగా మాట్లాడటం కలెక్టర్ స్థాయికి తగదని వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వేరుశనగ విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి-పత్తికొండ

రబీ సీజన్లో వేరుశనగ పంటను సాగు చేసే రైతులకు విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని పత్తికొండ మండల వ్యవసాయ అధికారి వెంకట రాముడు తెలిపారు. శుక్రవారం మండల వ్యవసాయ కార్యాలయంలో ఎఒ వెంకట రాముడు మాట్లాడుతూ పత్తికొండ మండలానికి 386 క్వింటాలు వచ్చాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధర రూ.9600, సబ్సిడీ ధర రూ.3840, రైతు రూ.5760 ధర చెల్లించాలన్నారు. 0–5 ఎకరాల వరకు ఉన్న ప్రతి రైతుకు 30 కేజీలు మూడు ప్యాకెట్లు వేరుశనగ విత్తనాలు ఇస్తామన్నారు. మరింత సమాచారం కోసం మీదగ్గరలోని రైతుసేవ కేంద్రాలను సంప్రదించాలని అన్నారు.

కార్యాలయాలను అమరావతికి తరలిస్తే అడ్డుకుంటాం

వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

లోకాయుక్త , హ్యూమన్ రైట్స్ కమిషన్లను కర్నూలు నుంచి అమరావతి తరలిస్తే అడ్డుకుంటామని వైసిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.మోహన్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కర్నూలు జిల్లా వైసిపి అధ్యక్షుడు ఎస్.వి.మోహన్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇక్కడి ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు న్యాయ రాజధాని ఏర్పాటులో భాగంగా లోకాయుక్తను , మానవ హక్కుల కమిషన్‌ను, ఎసిబి కోర్టును ఇక్కడ ఏర్పాటు చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాయలసీమపై సవతితల్లి ప్రేమ చూపిస్తూ వాటిని అమరావతికి తరలించాలని నిర్ణయం తీసుకున్నదన్నారు. దీన్ని రాయలసీమ వాసులుగా తీవ్రంగా ప్రతిఘటిస్తున్నామని అన్నారు. ఇక్కడ ఏర్పాటు అయి నడుస్తున్న సంస్థల తరలింపు మంచి పద్ధతి కాదని, దీన్ని టిడిపి రాయలసీమలోని నాయకులు ఒప్పుకోకూడదని తెలిపారు. గత ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి శ్రీభాగ్ ఒప్పందాన్ని గౌరవించి రాయలసీమ ముఖ ద్వారమైన కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు కృషి చేసారని తెలిపారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను అడ్డుకోవడానికి తాము త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

ప్రమాదకరంగా ఇండస్ట్రియల్ ఎస్టేట్ రహదారి

-భారీ వాహనాలు వెళ్లడంతో కళ్లల్లో పడుతున్న దుమ్ము ధూళి

-రాత్రి సమయంలో వెలగని వీధి దీపాలు

-సిసి రోడ్డు మధ్యలో సందులు

-అదుపుతప్పి కింద పడుతున్న ద్విచక్ర వాహనదారులు



చెన్నమ్మ సర్కిల్ రహదారిలో దుమ్ము దూళి లేపుతూ వెళ్తున్న భారీ వాహనాలు

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

కల్లూర్ చెన్నమ్మ సెంటర్ నుండి ముజాఫర్ నగర్ వరకు ఉన్న రహదారి ప్రమాదకరంగా మారింది. ఇండస్ట్రియల్ ఎస్టేట్లోకి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో దారిపై దుమ్ము ధూళి లేచి పాదచారులు, ద్విచక్ర వాహన దారుల కళ్లల్లో పడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే సిసి రోడ్డు మధ్యలో గ్యాప్‌లు ఉండటం వల్ల ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కింద పడి ప్రమాదాలకు గుర వుతున్నారు. రహదారికి ఇరువైపులా వీధిలైట్లు లేక పోవడంతో కారుచీకట్లో రాకపోకలు సాగి స్తున్నారు. రాత్రి సమయంలో వెలుతురు లేకపోవడం వల్ల రహదారిపై వెళ్తున్న పాదచారులు సైక్లిస్టులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ప్రమాదాలను అరికట్టేందుకు కల్లూరు చెన్నమ్మ సెంటర్ నుండి ముజాఫర్ నగర్ వరకు కొత్తగా రోడ్డు వేసి సెంటర్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఇలాంటి అంశాలపై డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పలు రకాల ఆందోళనలు చేపట్టింది. అధికారులకు ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు అందజేశారు. అయినా అధికారులకు స్పందించడం లేదు. ఇప్పటికైనా స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. వందలాది వాహనాలు వేలాదిమంది ప్రజలు తిరుగుతున్న ఈ రహదారిని తక్షణమే అభివద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రహదారి వెంట సెంట్రల్ లైటింగు ఏర్పాటు చేయాలి

డివైఎఫ్ఐ న్యూ సిటీ కార్యదర్శి హుస్సేన్ బాషా



కల్లూరు నుండి ముజఫర్ నగర్ వరకు రోడ్డు చాలా సమస్యగా మారింది. ఈ మార్గంలో రోడ్డు గుంతలు గుంతలుగా చీలిపోయి అస్తవ్యస్తంగా తయారైంది. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి వేళలో ఈ మార్గం మరింత ప్రమాదకరంగా ఉంది. చీలిపోయిన రోడ్డుపై వాహనదారుల వాహనాలు జారి పడి ప్రమాదాలు గురవుతున్నారు. ఆధికారులు తక్షణమే స్పందించి చెన్నమ్మ సెంటర్ నుండి ముజఫర్ నగర్ వరకు కొత్తగా రోడ్డు వేయాలి. సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలి.

మున్సిపల్ పదోన్నతుల్లో న్యాయం చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

గత నెలలో మున్సిపల్ ఉపాధ్యాయులకు సంబంధించి పదోన్నతుల ప్రక్రియకు ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడం తెలిసింది. అయితే ఈ ప్రక్రియలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని నంద్యాల, ఆదోని పురపాలక ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య రాష్ట్రఅధ్యక్షులు టి.వెంకట్‌రెడ్డి రాష్ట్రకమిటీ తరపున విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ పి.పార్వతికి వినతిపత్రం అందజేసి వివరాలు తెలిపారు. దాదాపు 14 ఏళ్లుగా మున్సిపల్ విద్యా వ్యవస్థలో ఒక్క పోస్టు కూడా మంజూరు కాలేదని, జిల్లాలో పురపాలక ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వుందన్నారు. ఇలాంటి సందర్భంలో ఉన్న అరకొర పోస్టులను డైరెక్ట్ రిక్రూట్మెంట్‌కే కేటాయించడం వల్ల, 70:30 విధానాన్ని పాటించడంలో జరిగిన లోపాలు పదోన్నతులు పొందబోవని, మున్సిపల్ ఉపాధ్యాయులకు తీవ్ర నిరాశకు గురిచేస్తోందని అన్నారు. మున్సిపల్ యూనిట్‌లో భౌతిక శాస్త్ర పోస్టులు 17 ఉండగా, 17 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇందులో పన్నెండు మంది పదోన్నతులు పొందిన వారు, ఐదుగురు డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా వచ్చిన వారు ఉన్నారు. ఖాళీగా ఉన్న మూడు పోస్టుల్లో 70:30 విధానం ప్రకారం రెండు పోస్టులకు పదోన్నతులు కల్పించి మూడో పోస్టును డైరెక్ట్ రిక్రూట్మెంట్‌కు కేటాయించాల్సి వుందన్నారు. ఒక్క పోస్టు కూడా పదోన్నతులకు కేటాయించలేదన్నారు. గణితంలో 22 పోస్టులకు గాను ఇరవై మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇందులో 13 మంది పదోన్నతులు పొందిన వారు, ఏడుగురు డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా భర్తీ అయిన వారు ఉన్నారు. మిగిలిన రెండు ఖాళీ పోస్టులను 70:30 విధానం ద్వారా భర్తీ చేయకుండా రెండు పోస్టులను డైరెక్ట్ రిక్రూట్మెంట్‌కే కేటాయించారన్నారు. అంతేగాక వర్గోన్నతి పొందిన వ్యాయామ , పండిత పోస్టులను కూడా డైరెక్ట్ రిక్రూట్మెంట్ కే కేటాయించడం వల్ల పదోన్నతులు లేక మున్సిపల్ ఉపాధ్యాయులు నష్టపోతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్పందిచిన అధికారులు సానుకూలంగా నిర్ణయం తీసుకొని సంబంధిత జిల్లాల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేస్తామన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస రావు , కర్నూలు జిల్లా నాయకులు బడుగు బసవరాజు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్‌కు వినతి ఇస్తున్న ఉపాధ్యాయ నాయకులు



మంజునాథ్‌ను అభినందిస్తున్న చింతసురేష్, పిబివి సుబ్బయ్య , తదితరులు

బోయవాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌గా తోళ్ల మంజునాథ్

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం గురువారం ప్రకటించిన పలు డైరెక్టర్ల నియామక జాబితాలో కర్నూలు జిల్లా నుండి జనసేన పార్టీకి స్థానం దక్కింది. వాల్మీకి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా పాణ్యం నియోజకవర్గానికి చెందిన తోళ్ల మంజునాథ్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. దీనికి వారు హర్షం వ్యక్తం చేస్తూ జనసేన పార్టీ తన సేవలను గుర్తించి బోయ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించినందున డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు , జనసేన పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్ చింత సురేష్ బాబుకు , మంజునాథ్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వివిధ నియోజకవర్గాల నాయకులు కార్యకర్తలు శుక్రవారం కర్నూలు బిర్లా కాంపౌండ్ జనసేన కార్యాలయంలో మంజునాథ్‌కు జనసేన నాయకులు పలువురు పుష్పగుచ్చం అందించి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. పిబివి సుబ్బయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జిగా క్రాంతి నాయుడు

ప్రజాశక్తి-పత్తికొండ



ఎపి పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల రెడ్డి పత్తికొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జిగా అడ్వకేట్ బోయ క్రాంతి నాయుడును నియమిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా బోయ క్రాంతి నాయుడు మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గం అభివృద్ధి, సాధికారత కోసం ప్రజా సమస్యలపై నిత్యం ప్రజల పక్షాన పోరాడుతానని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారాలు మోపుతుందని అన్నారు. పాలకుల విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించి పోరాటలను ప్రజలను సన్నద్ధం చేస్తామన్నారు. నాపై ఎంతో నమ్మకంగా ఆ పదవి బాధ్యతలు అప్పగించినందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

క్రాంతి నాయుడుకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-తుగ్గలి: పత్తి కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన క్రాంతి నాయుడు పదవి బాధ్యతలు అప్పగించినందుకు కాంగ్రెస్ పార్టీ ఒబిసి తాలూకా చైర్మన్ నాగార్జున శుభాకాంక్షలు తెలిపారు.యువనాయకుడు క్రాంతినాయుడు అందరి వాడుగా ఉంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తారనే పూర్తి విశ్వాసం ఉందన్నారు. ఆయన నాయకత్వంలో పని చేస్తామన్నారు.

ప్రజా సమస్యలు నిర్లక్ష్యం చేయవద్దు

- మున్సిపల్ కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని



రికార్డులు తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 25, 26వ వార్డు సచివాలయాలను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సచివాలయంలో స్వీకరించిన అర్జీల పరిష్కారం, వాటి స్థితిగతుల గురించి ఎప్పటికప్పుడు సంబంధిత వ్యక్తులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. విధులకు సకాలంలో హాజరు కావాలని, పని నిమిత్తం బయటకు వెళితే మూవ్‌మెంట్ రికార్డులో విషయం పొందపరచాలని చెప్పారు. విధులను నిర్లక్ష్యం చేయరాదని, అలా తనిఖీల్లో వెల్లడైతే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని



సభ్యత్వం ఇస్తున్న మీనాక్షి నాయుడు

సమస్యలు వచ్చినా కార్యకర్తలు ఎవరూ అధైర్య పడవద్దని, అండగా ఉంటామని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు భరోసా ఇచ్చారు. శుక్రవారం పట్టణంలోని రెండో వార్డులోని బావాజీపేటలో వార్డు ఇన్‌ఛార్జీ మాజీ కౌన్సిలర్ తిమ్మప్ప ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడారు. అధికారం ఉన్నా, లేకున్నా నియోజకవర్గంలో కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా తమ కుటుంబం అండగా ఉంటూ వారికి సహాయ, సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. టిడిపికి కార్యకర్తలే బలమని, వారిని కాపాడుకునేందుకు పార్టీ అధినేత సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి బీమా సౌకర్యం కల్పిస్తూ ఆర్థిక భరోసా ఇస్తున్నారని తెలిపారు. పార్టీ సభ్యత్వం తీసుకునే వారి సంఖ్య నియోజకవర్గంలో రోజురోజుకు పెరుగుతోందని పేర్కొన్నారు. టిడిపికి తమ కుటుంబం అంకితమని, ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఎదుర్కొనే సత్తా ఉందని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు ఆజ్ఞ ప్రకారమే తాము నడుచుకుంటున్నామని, పార్టీ ఏ బాధ్యత అప్పజెప్పినా చేస్తామని తెలిపారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, జిల్లా కార్యదర్శి బుద్ధారెడ్డి, రామస్వామి, గోనబావి గోపాల్, మల్లికార్జున ఉన్నారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు నాయకులు హనుమంతు

ప్రజాశక్తి - ఆస్పరి




డాక్టర్ బాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు

ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు నాయకులు హనుమంతు, విఠల్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎపి ఆశావర్కర్స్ యూనియన్ మండల నాయకులు లక్ష్మీ, భారతి, రాజేశ్వరి, గోవిందమ్మలు డాక్టర్ బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేసిందని, అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వమైనా నెరవేర్చాలని కోరారు. ఆశాల సమస్యలను పరిష్కరించి, ఫిబ్రవరి 2024 ఆశా వర్కర్ యూనియన్ రాష్ట్ర ప్రతినిధి బృందంతో జరిగిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల జిఒ విడుదల చేయాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఎన్‌సిడి సర్వేలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా ప్రమోట్ చేయాలని, పని భారం తగ్గించి రూ.10 లక్షల గ్రూపు ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈనెల 18న కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాలో మండలంలోని ఆశాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లికార్జున

ప్రజాశక్తి - హొళగుంద



మండలంలోని పెద్దహ్యాట గ్రామంలో విద్యార్థిని వెన్నెల వీపుపై వాతల పడేలా కొట్టిన ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లికార్జున డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. విద్యార్థులు తప్పు చేస్తే ఇలా గొడ్డును బాదినట్లు కొడతారా అని ప్రశ్నించారు. ఎవరిపై కోపాన్నో ఇలా విద్యార్థులపై చూపితే ఎలా అని నిలదీశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన ఎంఇఒలు కూడా ఎలాంటి చర్యలూ తీసుకోక పోవడం విచారకరమని విమర్శించారు. పెద్దహ్యాట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

● సిపిఎం నాయకులు ● తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రజా సమస్యల పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో కోసిగి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సిపిఎం మండల నాయకులు వీరేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని ప్రజలు కోరుతుంటే మద్యం ధరలు తగ్గించామని కూటమి ప్రభుత్వం చెబుతోందని మండిపడ్డారు. కోసిగి మండలాన్ని కరువుగా ప్రకటించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ పరశురాముకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం కోసిగి మండల కన్వీనర్ రాముడు, నాయకులు వెంకటేశ్వర్లు, చిన్నన్న, ఆటో యూనియన్ నాయకులు అమీర్, అంజి, వీరేష్, రైతుసంఘం నాయకులు జలీల్, రామకృష్ణ, హనుమంతు, నాగేంద్ర, గోపాల్, చిన్న కోసిగయ్య, హనుమంతు, మోహన్, పూజారి శ్రీనివాసులు పాల్గొన్నారు. **దేవనకొండ** తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సిపిఎం నాయకులు యూసుఫ్ బాషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.వీరశేఖర్, నాయకులు అశోక్, సూరి మాట్లాడారు. ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ప్రజలకు మేలు చేయకుండా భారాలు వేసే పని పెట్టుకుందని తెలిపారు. విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని, కొత్త స్మార్ట్ మీటర్లు పెట్టే విధానాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలను అదుపు చేయాలని, రైతు భరోసా ద్వారా రైతులకు రూ.20 వేలు ఇవ్వాలని కోరారు. జిల్లా అభివృద్ధికి, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు కేటాయింపు జరగలేదని, వేదవతికి నిధులు కేటాయించకపోవడం దారుణమని విమర్శించారు. కౌలుట్ల, బండ్లయ్య, రాముడు, మహేష్, బజారి, సుధాకర్ పాల్గొన్నారు. **నందవరం** తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం మండల నాయకులు ఎల్లేష్ అధ్యక్షతన ధర్నా చేపట్టారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సి.గురుశేఖర్, నాయకులు ఎల్లేష్, దేవపుత్ర మాట్లాడారు. గ్రామాల్లో రోడ్లు, కాలువలు ఘోరంగా ఉన్నాయని, వాటిని నిర్మించాలని కోరారు. అనంతరం తహశీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. తహశీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ... ఈ డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్తానని, తన పరిధిలో ఉండే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సిపిఎం మండల నాయకులు దేవపుత్ర, స్వామి దాసు, నరసింహులు, పెద్దయ్య, దేవదాసు, సంతోష్, రవి, కొండన్న పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని బస్టాండ్ సెంటర్‌లో నిరసన చేపట్టి, ఎంపిడిఒ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. సిపిఎం మండల నాయకులు నబి రసూల్ అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎమ్‌డి.ఆనంద్ బాబు, జిల్లా నాయకులు రంగయ్య, మండల శాఖ కార్యదర్శి బి.కరుణాకర్, నాయకులు ఖాజా మాట్లాడారు. మండలంలో పేరెన్నిక గన్న గాజులదిన్నె ప్రాజెక్టు ఉన్నా 10 గ్రామాల్లో తాగునీటికి కటకటలాడాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఎమ్మిగనూరు నుంచి కోడుమూరు దాకా ఉండే ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అగ్రహారంలో శ్మశాన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అనంతరం ఎంపిడిఒ మణిమంజరికి వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల నాయకులు అగ్రహారం నరసింహులు, గిరిరాజు, గోవిందు, అక్బర్ బాష, గోనెగండ్ల నాయకులు బతకన్న, మునెప్ప, వెంకటేశ్వరమ్మ, గంజహళ్లి నాయకులు తిమ్మప్ప, జయన్న, మోహన్, దరగయ్య, రంగయ్య పాల్గొన్నారు. **పెద్దకడబూరు** తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న, నాయకులు పరమేష్, ఈరన్న, పెద్దయ్య పాల్గొన్నారు.



కోసిగిలో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు



దేవనకొండలో మాట్లాడుతున్న వీరశేఖర్



నందవరంలో తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గురుశేఖర్



గోనెగండ్లలో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఏ వ్యాధినీ నిర్లక్ష్యం చేయకూడదు

- సచివాలయ ఎఎన్ఎం సువర్ణమ్మ, ఎంఎల్‌హెచ్‌పి రెడ్డి శేఖర్

ప్రజాశక్తి - చిప్పగిరి

అసలే వర్షాకాలం.. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే నేపథ్యంలో కొద్దిగా అనారోగ్యంగా ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షించుకోవాలని సచివాలయ ఎఎన్ఎం సువర్ణమ్మ, ఎంఎల్‌హెచ్‌పి రెడ్డి శేఖర్ ప్రజలకు, మహిళలకు సూచించారు. శుక్రవారం డిఎంహెచ్ఒ భాస్కర్, ప్రభుత్వ డాక్టర్ అఫ్రోజ్ జహాన్ ఆదేశాల మేరకు నేమకల్లు గ్రామంలో ఆశా కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి క్యాన్సర్, బీపీ, షుగర్ తదితర వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో ముఖ్యంగా మహిళలు ఆరోగ్యంపై అశ్రద్ధ చేయకూడదని తెలిపారు. నివాస, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఇంట్లోనూ పాత్రలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆశా కార్యకర్తలు రాధమ్మ, వీరమ్మ, కవిత పాల్గొన్నారు.



ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

సమాజాభివృద్ధిలో విద్యార్థులే కీలకం

- తహశీల్దార్ మల్లికార్జున స్వామి, ఎంపిడిఒ సుబ్బరాజు

ప్రజాశక్తి - కౌతాళం

సమాజాభివృద్ధిలో విద్యార్థులే కీలకమని తహశీల్దార్ మల్లికార్జున స్వామి, ఎంపిడిఒ సుబ్బరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రతిభ హైస్కూల్‌లో 'సెల్ ఫోన్ వల్ల యోజనాలు- నష్టాలు' వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకున్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. నేటి ప్రపంచంలో సెల్‌ఫోన్ వల్ల మంచిని విద్యార్థులు స్వీకరించాలని, చెడుకు దూరంగా ఉన్నప్పుడే సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండి, పోటీ ప్రపంచంలో రాణించగలరని సూచించారు. అనంతరం ప్రతిభ హైస్కూల్‌లో ఉత్తమ ఉపాధ్యాయులకు సంబంధించి, డివిజన్ స్థాయిలో చెకుముకిలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష, సెక్రటరీ మైనుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

నదుల సంరక్షణ అందరి బాధ్యత

- పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు

ప్రజాశక్తి - మంత్రాలయం

నదుల సంరక్షణ అందరి బాధ్యత అని శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు తెలిపారు. శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా తుంగభద్ర నదీతీరంలో తుంగ హారతి నిర్వహించారు. తుంగభద్ర నదిలో విశేష పూజలు నిర్వహించి, మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడారు. పూర్వం నుంచి నదులకు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. సమస్త జీవరాశులకు ఆధారమైన నీటి సంరక్షణ సామాజిక బాధ్యత అన్నారు. నదులు కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ చొరవ తీసుకుని నదుల సంరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్తీక దామోదరుడికి విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం ఆయన ఆదేశాల మేరకు నదీతీరంలోను, శ్రీమఠం ఆవరణలోనూ లక్ష దీపోత్సవం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా సిఐ రామాంజులు, ఎస్ఐలు పరమేష్ నాయక్, మహేష్ కుమార్, విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బందితో తగిన భద్రత కల్పించారు.



మాట్లాడుతున్న పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు



ప్రియుడి ఇంటి ముందు కూర్చున్న యువతి

యువకుని ఇంటి ముందు యువతి నిరసన

ప్రజాశక్తి - ఆదోని

రెండేళ్లుగా ప్రేమిస్తూ.. పెళ్లి చేసుకుంటానని మాటిచ్చి.. తల్లిదండ్రులను ఒప్పించి చివరకు ఎంగేజ్‌మెంట్ రోజు యువకుడు ఈశ్వర్ ప్రసాద్ పరారు కావడంతో యువతి చందన యువకుని ఇంటి ముందు ఆందోళన చేపట్టారు. శుక్రవారం పట్టణంలో నివాసముంటున్న ఈశ్వర్ ప్రసాద్ ఇంటి ముందు కర్ణాటక రాష్ట్రం మైసూర్‌కు చెందిన యువతి చందన నిరసన చేస్తున్న విషయం సంచలనం సృష్టించింది. ఆమె మాట్లాడుతూ... తాను కర్ణాటక రాష్ట్రం మైసూర్ నివాసినని తెలిపారు. అక్కడే ఉన్నత విద్యనభ్యసించి బెంగళూరులోని ఓ ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్లు చెప్పారు. ఆదోనికి చెందిన ఈశ్వర ప్రసాద్, తాను రెండేళ్లుగా ప్రేమించు కుంటున్నామని, పెళ్లి కూడా చేసుకుంటానని.. ఇటీవలే ఆదోనికి పిలుచుకొచ్చాడని వివరించారు. ఈనెల 14న ఇద్దరికీ ఎంగేజ్‌మెంట్ చేస్తామని, డిసెంబర్ 6న పెళ్లి చేస్తామని పెద్దల సమక్షంలో మాట ఇచ్చి ఈశ్వర్ ప్రసాద్ మాయమయ్యాడని వాపోయారు. గతవారం రోజులుగా చందన ఈశ్వర్ ప్రసాద్ ఇంట్లోనే ఈశ్వర ప్రసాద్ తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నారు. ఇటీవలే పెద్దల సమక్షంలో పంచాయితీ చేశారని, పెళ్లి చేసుకుంటామని మాట ఇచ్చి ఇలా ఆమెను వదిలి వెళ్లిపోవడం ఏమిటని ఆదోనికి చెందిన న్యాయవాది పద్మ దేశాయ్ ప్రశ్నించారు. చందనకు అన్యాయం జరగకుండా తాము అండగా ఉంటామని, అందుకోసమే ఆమెతో పాటు బైఠాయించినట్లు తెలిపారు. చందనకు న్యాయం చేయాలని, న్యాయం జరిగే వరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని చెప్పారు.


టిడిపి ఇన్‌ఛార్జీ వివక్ష

● దళిత సర్పంచి
● న్యాయం చేయాలంటూ అంబేద్కర్ సర్కిల్ ఎదుట నిరసన

ప్రజాశక్తి - ఆలూరు

టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ తనపై వివక్షత చూపుతున్నారని ఆలూరు సర్పంచి అరుణదేవి విమర్శించారు. శుక్రవారం ఆలూరులో పంచాయతీ కార్యాలయం నుంచి పట్టణ పురవీధుల గుండా నినాదాలతో ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ సర్కిల్‌లో మోకాళ్లపై నిలబడి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచి అరుణదేవి, టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి బెంగళూరు కిషోర్ మాట్లాడారు. గత ఎన్నికల్లో వీరభద్ర గౌడ్ గెలుపు కోసం సొంత ఖర్చులు పెట్టుకొని తిరిగినా.. తమకు పంచాయతీ అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా, తమ తీర్మానం లేకుండా వేరే వారికి సిసి రోడ్లకు అనుమతులు ఇచ్చారని తెలిపారు. దీనికి అధికారులు వత్తాసు పలుకుతున్నారని చెప్పారు. వీరభద్ర గౌడ్‌ను ఇన్‌ఛార్జీ పదవి నుంచి తొలగించాలని అధిష్టానాన్ని కోరారు. వైసిపి హయాంలో వ్యాపారాలు చేసుకుంటూ కాలం గడిపారని, ఏ టిడిపి కార్యకర్తకూ అండగా ఉండలేక పోయారని విమర్శించారు. నాడు వైసిపి నాయకులతో తాము ఎన్నో ఇబ్బందులకు గురయ్యామని తెలిపారు. అనంతరం ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహశీల్దార్ గోవింద్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. టిడిపి నాయకులు షేక్షావలీ, మద్దిలేటి యాదవ్, మహేష్, రాజు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న సర్పంచి, నాయకులు



ప్రభుత్వ భూమి గుర్తింపు

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ క్రాస్ రోడ్డు సమీపంలోని కుంకనూర్ రెవెన్యూ పరిధిలో వివాదాస్పదంగా ఉన్న ప్రభుత్వ భూమి పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్ సూచనల మేరకు శుక్రవారం 591 సర్వే నెంబర్‌లో 6.59 వంక పోరంబోకు భూమిగా ఉన్నట్లు మండల రెవెన్యూ అధికారులు గుర్తించారు. శుక్రవారం తహశీల్దార్ లోకేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ సుదర్శనం ఆధ్వర్యంలో 591 సర్వేనెంబర్‌లోని భూమిని సర్వేయర్లు కొలతలు వేసి ప్రభుత్వ వంక పోరంబోకు భూమిగా గుర్తించారు. 597 సర్వేనెంబర్ పట్టా భూమిలో కొందరు వేసిన బండలు వేశారు. ఆ సర్వే నెంబర్ కోర్టు పరిధిలో ఇంజక్షన్ ఆర్డర్‌లో ఉందని, ఈ మేరకు ఆ బండలను తొలగించడానికి సిఐ వంశీనాథ్ చర్యలు చేపట్టారు.

ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతోనే అభివృద్ధి

- ఎంపిడిఒ గీతావాణి

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని పంచాయతీల్లో ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపిడిఒ గీతావాణి తెలిపారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రెండోరోజు అభివృద్ధి ప్రణాళికలకు సంబంధించి మండల స్థాయి అధికారులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ... పంచాయతీల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి పంచాయతీలకు వస్తున్న నిధులు, ఆదాయ వనరులను కలుపుకొని చేపట్టాల్సిన పనులను రూపొందించుకోవాలని సూచించారు. ఇఒఆర్‌డి విజయభాను పాల్గొన్నారు.

శిక్షణకు హాజరు కావాలి

- ఎంపిడిఒ సుబ్బరాజు

ప్రజాశక్తి - కౌతాళం

పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2025-26 ఆర్థిక సంవత్సరానికి మండల స్థాయిలో నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి హాజరుకావాలని ఎంపిడిఒ సుబ్బరాజు కోరారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎంపిపి, జడ్‌పిటిసి, వైస్ ఎంపిపి 1, 2, కోఆప్టేడ్ సభ్యులు, ఎంపిటిసిలు, సర్పంచులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, మండల ఇంజినీరింగ్ అధికారి, అసిస్టెంట్ ఇంజినీర్, తదితర అధికారులు తప్పకుండా హాజరు కావాలని తెలిపారు.

గ్రంథాలయాలతో విద్యార్థుల అభివృద్ధి

- గ్రంథాలయ అధికారి శివరామ ప్రసాద్

ప్రజాశక్తి - నందవరం

గ్రంథాలయాలు విద్యార్థుల అభివృద్ధికి దోహదపడతాయని నందవరం గ్రంథాలయ అధికారి వై.శివరామ ప్రసాద్ తెలిపారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుస్తక ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 14 నుంచి 20 వరకు గ్రంథాలయ వార్షికోత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. రెండో రోజు పుస్తక విభాగంలో పుస్తక ప్రదర్శన నిర్వహించామని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేవి గ్రంథాలయాలేనని, గ్రంథాలయాలకు వెళ్లేందుకు విద్యార్థులు చొరవ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు పుస్తక పఠనంపై దృష్టి సారిస్తే అద్భుతమైన విజయాలు సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులకు సీనియర్స్ విభాగంలో పర్యావరణం, జూనియర్స్ విభాగంలో 'నచ్చిన జాతీయ నాయకుల్లో ఒకరు' అనే అంశాలపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. 30 మంది విద్యార్థులు హాజరయ్యారు. **ఆదోని** గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. గ్రంథాలయ గ్రేడ్-1 ఆఫీసర్ సుజాత, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు శారమ్మ మాట్లాడారు. పుస్తక పఠనంతో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. నారాయణపురం ఎంపియుపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మినారాయణ, వివేకానంద పాఠశాల ఉపాధ్యాయులు సోఫియా ఆఫ్రిన్ పాల్గొన్నారు.



నందవరంలో పుస్తక ప్రదర్శన చేపడుతున్న అధికారులు



ఆదోనిలో మాట్లాడుతున్న శారమ్మ



ఎన్నికైన ఉలిగప్ప, చెన్నయ్య

'విద్యుత్' సమస్యల పరిష్కారానికి కృషి

- ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

విద్యుత్ శాఖలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఉలిగప్ప, చెన్నయ్య తెలిపారు. శుక్రవారం ఆదోనిలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అసిస్టెంట్ ఇంజినీర్ ఉలిగప్ప, కార్యదర్శిగా సబ్ ఇంజినీర్ చెన్నయ్య, గౌరవాధ్యక్షులుగా రామదాస్, మరి కొంతమందిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చొరవ చూపుతామని తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు కెజిబివి విద్యార్థిని

- విద్యార్థినికి పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని లావణ్య వెయిట్ లిఫ్టింగ్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయులు కల్యాణి శుక్రవారం తెలిపారు. కృష్ణాజిల్లా గుడివాడలో జరిగే అండర్-19 క్రీడల్లో పాల్గొనడానికి వెళ్లనున్న లావణ్యకు గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 చదివిన విద్యార్థులు రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. లావణ్య క్రీడల్లో విజయాలు సాధించి, పాఠశాలకు, స్వగ్రామానికి మంచి పేరు తేవాలని కోరారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మహాసదస్సును జయప్రదం చేయండి

- ఎంఎస్‌పి నాయకులు



గోడపత్రికను ఆవిష్కరణ నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎస్సీ వర్గీకరణ అమలు సాధనకు రాష్ట్రంలో మాదిగల సమాయత్త మహా సదస్సును విజయవంతం చేయాలని ఎంఎస్‌పి జిల్లా అధికార ప్రతినిధి ఆనంద్ చైతన్య, పూలచింత పెద్దయ్య, ముగతి యెహోషువా, ప్రతాప్ కోరారు. శుక్రవారం స్థానిక ఎంఆర్‌పిఎస్ కార్యాలయంలో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మాదిగల ఆత్మీయ సమావేశం సోమవారం సాయంత్రం కర్నూలు కోల్స్ కళాశాల మైదానంలో జరుగుతుందని, ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. ముందుగా కలెక్టరేట్ నుంచి కోల్స్ కళాశాల మైదానం వరకు ర్యాలీ చేపట్టనున్నట్లు, విజయవంతం చేయాలని కోరారు. మండల నాయకులు హాలహర్వి ప్రకాశం, కందనాతి నరసన్న, ఆనంద్, డేవిడ్ పాల్గొన్నారు.

జూనియర్, డిగ్రీ కళాశాల మంజూరు చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

నియోజకవర్గంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కోరారు. శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను మంత్రి ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏటా నియోజకవర్గంలో 10వేలకు పైగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి ఉన్నత చదువులకు సరైన కళాశాలలు లేక బయటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు డిగ్రీ కళాశాల నిర్మాణానికి పక్కా భవనం ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

శ్రీగిరి క్షేత్రంలో జ్వాలాతోరణం

- పంచలింగేశ్వర ఆలయంలో వైభవంగా లక్ష దీపోత్సవం

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని బిణిగేరి గ్రామ కొండల్లో శ్రీగిరి క్షేత్రంలో వెలసిన శ్రీపంచలింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ నిర్వాహకులు శ్రీనివాస నాయన ఆధ్వర్యంలో శుక్రవారం లక్ష దీపోత్సవం, జ్వాలా తోరణం ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి నిర్వహించారు. ఉదయం పంచలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా శ్రీగిరి క్షేత్రంలో కార్తీక వనభోజనం నిర్వహించారు. సాయంత్రం పంచలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి పల్లకిని ఊరేగించారు. విచ్చేసిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. గురూజీ, బాలాజీ, అనిల్, సంతోష్, సర్పంచి వెంకటేష్, సొసైటీ మాజీ ఛైర్మన్ గోవర్ధన్, వైసిపి కో కన్వీనర్ పురుషోత్తం రెడ్డి, సొసైటీ మాజీ ఛైర్మన్ కేశవరెడ్డి, దత్తాత్రేయ రెడ్డి, సొసైటీ సిఇఒ అశోక్, వైసిపి సోమన్న, తిమ్మప్ప, వెంకటేష్, భీమన్న, శంకరయ్య, వీరేష్, సుధ, నాగరాజు, సూరి, తిప్పయ్య, రవిచంద్ర, తిక్కయ్యలు పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న రావూస్ యాజమాన్యం, అధికారులు

మహిళలపై దాడులను తిప్పికొట్టాలి

- కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి


ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మహిళలపై జరుగుతున్న దాడులను రాజ్యాంగం కల్పించిన చట్టాల ద్వారా తిప్పి కొట్టాలని రావూస్ డిగ్రీ కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి, ఎమ్మిగనూరు సిడిపిఒ సఫారున్నీసా బేగం, చైల్డ్ ప్రొటెక్షన్ లీగల్ ప్రొహిబిషన్ జిల్లా ఆఫీసర్ శ్రీలక్ష్మి, ఎమ్మిగనూరు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎ.సుధావతి, సిఆర్‌ఫిఎఫ్ జిల్లా కన్వీనర్ ఇ.లింగన్న కోరారు. శుక్రవారం రావూస్ డిగ్రీ కళాశాల అధ్యక్షతన మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమాజంలో ఆడపిల్లలకు రక్షణ కరువైందని, వారికి రక్షణ కల్పించడమే లక్ష్యంగా మహిళా శిశు సంక్షేమ శాఖ కృషి చేస్తోందని తెలిపారు. బాల్యవివాహాలు, వరకట్నం, గృహహింస, పుట్టిన పసిగుడ్డు నుంచి వృద్ధాప్య మహిళ వరకు లైంగిక దాడులు, మహిళా కిడ్నాప్‌లు, అరాచకాల మధ్య ప్రతి మహిళా నలిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన వివిధ రకాలైన మహిళా చట్టాల ద్వారా రక్షణ పొందవచ్చని తెలిపారు. అరాచక దాడుల నుంచి కాపాడుకోవడానికి 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయవచ్చని అవగాహన కల్పించారు. మహిళకు విద్య ద్వారానే ధైర్యం, జ్ఞానం, మంచి ప్రవర్తన అలవడుతుందని, విద్యపై దృష్టి సారించాలని విద్యార్థులను కోరారు. దాడులు జరిగినప్పుడు ముందుగా తల్లిదండ్రులకు, తర్వాత కళాశాల అధ్యాపకులకు తెలపాలని కోరారు. అనంతరం ముఖ్య అతిథులను కళాశాల యాజమాన్యం సన్మానించింది. కళాశాల ప్రిన్సిపల్ ఇర్ఫాన్, కల్చరల్ ప్రోగ్రామ్ ఇన్‌ఛార్జీ విజయ్ కుమార్, స్క్రిప్ట్ రైటర్ పాలరాజ్, సీనియర్ అధ్యాపకులు గోరంట్ల, మహిళా అధ్యాపకులు నందిని, అన్నపూర్ణ, శ్రుతి ప్రియా, సంధ్య, ఈరేశ్వరి పాల్గొన్నారు.

టిడిపితోనే పల్లెల అభివృద్ధి

- మాజీ సర్పంచి రఘునాథ్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం



భూమిపూజ చేస్తున్న రఘునాథ్ రెడ్డి

రాష్ట్రంలో పల్లెలు అభివృద్ధి చెందాలంటే టిడిపితోనే సాధ్యమని టిడిపి నాయకులు, మాధవరం మాజీ సర్పంచి ఎన్.రఘునాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని మాధవరం గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో సిసి రోడ్లు, డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో ప్రగతి పరుగులు తీస్తుందని కొనియాడారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను తమ సోదరులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి ముఖ్యమంత్రికి, ఐటి, విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. ఆయన చొరవతో నిధులు మంజూరయ్యాయని చెప్పారు. గత వైసిపి హయాంలో గ్రామాల్లో అభివృద్ధికి నోచుకోలేదని తెలిపారు. సర్పంచి ఇందిరమ్మ, సెక్రటరీ వేణుగోపాల్, ఉరుకుందు, భీమారెడ్డి, నాగరాజు, సిద్ధయ్య, ఈరన్న, ప్రసాద్ పాల్గొన్నారు.